నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 23 మే 2025 | MAHABUBNAGAR NARAYANPET

డీపీఆర్ లేకుండా ప్రాజెక్టు నిర్మిస్తారా?

- కమీషన్ల కోసమే కొడంగల్ ఎత్తిపోతల
- పరిపాలన చేతగాక కేసీఆర్‌పై అసత్య ఆరోపణలు
- సీఎంకు రైతులపై ప్రేముంటే 'పాలమూరు' ప్రాజెక్టు పూర్తి చేయాలి
- రైతులకు అన్యాయం చేయాలని చూస్తే సహించం
- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరచింత విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరచింత, మే 22 : సీఎం రేవంత్‌రెడ్డి నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలకు డీపీఆర్ లేకుండా పనులు ప్రారంభించడాన్ని చూస్తుంటే కమీషన్ల కోసమేనని వెల్లడవుతుందని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు. గురువారం అమరచింతలోని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజేందర్‌సింగ్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మక్తల్ నియోజకవర్గంలోని రైతుల భూములకు సాగునీరు అందించేందుకు దివంగత చిట్టెం నర్సిరెడ్డి నిరంతరం కృషి చేసి భీమా ప్రాజెక్టు నిర్మాణం కోసం పని చేశారని, ఈ ప్రాంత రైతుల ప్రయోజనాలను విస్మరించి భూత్పూర్ కెనాల్ నుంచి కొడంగల్ రైతులకు నీటిని తరలిస్తామంటే ఊరుకోమని హెచ్చరించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలబెట్టగా, కాంగ్రెస్ ఏడాదిన్నరలోనే 20ఏండ్ల అభివృద్ధి వెనక్కి నెట్టిందన్నారు. భూత్పూర్ కెనాల్ ద్వారా మక్తల్, నర్వ, అమరచింత, ఆత్మకూర్ మండలాల్లోని వివిధ గ్రామాల చెరువులకు సాగునీటిని వదిలి రైతులు ఏడాదికి రెండు పంటలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాంత రైతుల నోట్లో మట్టి కొట్టి ఇక్కడి నుంచి కొడంగల్ ఎత్తిపోతలకు నీటిని తరలిస్తామంటే ఎవరూ ఒప్పుకోరన్నారు. సొంత నియోజకవర్గంలోని రైతులపై సీఎంకు ప్రేముంటే కొడంగల్ పక్కనే అందుబాటులో ఉన్న సాగు నీటిని తీసుకురావాలని సూచించారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సీఎం మెప్పు కోసం కొడంగల్ ఎత్తిపోతల పూర్తయితే ఊట్కూర్ మండలంలో 30ఎకరాల భూమి సాగులోకి వస్తుందని ప్రగల్భాలు పలుకుతున్నారని, భూత్పూర్ కెనాల్ నుంచి 4టీఎంసీల నీటిని తరలిస్తే నర్వ, అమరచింత, ఆత్మకూర్ మండలాల్లోని వేల ఎకరాల సాగుభూములు బీడుగా మరుతాయన్న విషయం ఎందుకు మరిచారని ప్రశ్నించారు. స్వార్థ రాజకీయాల కోసం రైతుల కడుపు కొడితే సహించేది లేదన్నారు. ఇప్పటికే 90శాతం పనులు పూర్తయిన పాలమూరు ఎత్తిపోతల పథకం పనులను గాలికొదిలేసి కమీషన్ల కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని తీసుకొచ్చిన రేవంత్‌రెడ్డికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సాగునీటి ప్రాజెక్టులపై అవగాహన లేక కొందరి కోసం అందరికీ అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. గ్యారెంటీలన్నీ గాలికొదిలేసి కేసీఆర్‌పై ఆరోపణలు చేస్తూ ఇంకెంత కాలం పబ్బం గడుపుతారని నిలదీశారు. సమావేశంలో అమరచింత మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మంగమ్మ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజు, నాగభూషణంగౌడ్, ఆత్మకూర్, అమరచింత మండలాల బీఆర్ఎస్ అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, రమేశ్, మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యుడు రియాజ్‌అలీ, చిన్నబాల్‌రాజు, రవి పాల్గొన్నారు.

జడ్చర్ల పత్తి మార్కెట్ వద్ద రోడ్డుపై ఆందోళనకు దిగిన రైతులు

- తిండీ తిప్పలు లేకుండా 20 రోజులుగా..
- టోకెన్లు ఇవ్వరు.. ధాన్యం తూకం చేయరు
- కలెక్టర్ ఆదేశించినా పట్టింపు కరువు
- వర్షానికి తడిచి తీవ్రంగా నష్టపోతున్నాం
- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు
- జడ్చర్ల జాతీయ రహదారి-167పై రాస్తారోకో

కుప్పల వద్దే పడిగాపులు

జడ్చర్ల టౌన్, మే 22 : రోజుల తరబడి నిరీక్షించినా వడ్లు కొనుగోలు చేయడం లేదని జడ్చర్లలోని పత్తి మార్కెట్‌యార్డు ఎదుట 167వ జాతీయ రహదారిపై గురువారం రైతులు రాస్తారోకో చేపట్టారు. జడ్చర్ల పత్తి మార్కెట్‌లో పీఏసీసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు కొనుగోలు చేయడం లేదని రైతులు మండిపడ్డారు. వారం రోజులైనా టోకెన్లు ఇవ్వడం లేదని, ధాన్యం తుకాలు వేయడం లేదని ఆరోపించారు. ధాన్యం బస్తాలను కొనుగోలు చేసి వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ చెప్పినా పట్టించుకోరా అంటూ సంబంధిత అధికారులపై మండిపడ్డారు. వారం రోజులుగా ధాన్యం కుప్పల వద్దే పడిగాపులు కాస్తున్నా తేమశాతం పేరుతో టోకెన్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కొందరికి టోకెన్లు ఇచ్చినా ధాన్యం తూకం వేయట్లేదని, సరిపడా టార్పాలిన్లు లేక వర్షానికి ధాన్యం తడిసి మొలకొస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో కేవలం 40 టార్పాలిన్లు ఉండగా, వాటిని తూకం వేసి ధాన్యం బస్తాలకు మాత్రమే పీఏసీసీఎస్ వినియోగిస్తున్నారు. దీంతో మార్కెట్‌యార్డు ఆవరణలో నిల్వ ఉన్న మిగతా ధాన్యం కుప్పల కోసం రైతులే టార్పాలిన్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధాన్యం కొనుగోలు చేసే వరకు రోడ్డుపైనే బైఠాయిస్తామంటూ రైతులు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను స్తంభింపజేశారు. విషయం తెలుసుకున్న పౌరసరఫరాలశాఖ డీఎం రవినాయక్, ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

టోకెన్ల జారీలో నిర్లక్ష్యం..

ధాన్యం విక్రయించేందుకు వచ్చిన రైతులకు టోకెన్ల జారీలో నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పీఏసీసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం పరిధిలో 5 క్లస్టర్లలో 12 గ్రామాలున్నాయి. టోకెన్లు సకాలంలో అందించకపోవడంతో రోజుల తరబడిగా ధాన్యం కుప్పల వద్దే పడిగాపులు కాస్తున్నామని రైతులు వాపోయారు.

ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్‌ను కప్పుతున్న రైతులు

వచ్చి వారం రోజులైంది..

నాలుగు ట్రాక్టర్ల ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకొచ్చి వారం రోజులైంది. టోకెన్ ఇచ్చి నాలుగు రోజులైంది. ఇంకా తూకం వేయలేదు. ధాన్యం కుప్పల వద్దే పడిగాపులు కాస్తున్నా. వర్షానికి ధాన్యం తడిసి మొలకొస్తుంది. టార్పాలిన్ కవర్లు ఇవ్వడం లేదు. ధాన్యం పండించడం ఓ ఎత్తయితే అమ్మడం మరో సాహసమైంది.

– స్వామి, రైతు, కావేరమ్మపేట

ధాన్యం కొనడం లేదు..

12 ట్రాక్టర్ల ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకొచ్చిన. 20రోజులు అవుతుంది. తేమశాతం పేరుతో ధాన్యం కొనడం లేదు. వర్షానికి ధాన్యం తడిసిపోతుంది. సొంత డబ్బులతో టార్పాలిన్ కవర్లు తెచ్చుకొని ధాన్యానికి కప్పుకొంటున్నాం. తిండి, తిప్పలు లేకుండా కుప్పల వద్దే పడిగాపులు కాస్తున్నాం. లారీలో ఎక్కించే వరకు మాదే బాధ్యతని చెబుతున్నారు.

– జంగయ్య, రైతు, గంగాపూర్

రైతులంటే లెక్కలేదా..?

కాట్రేవుపల్లిలో అధికారుల కోసం వేచి ఉన్న రైతులు

- సమావేశానికి హాజరుకావాలని అధికారుల డుమ్మా
- గంటల తరబడి పంచాయతీ కార్యాలయం వద్ద నిరీక్షణ
- ఆఫీసర్ల తీరుపై అన్నదాతల మండిపాటు

మక్తల్, మే 22 : నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులతో అభిప్రాయ సేకరణ కోసం కాట్రేవుపల్లి పంచాయతీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సమావేశమవుతారని నిర్వాసితులకు అధికారులు ముందుగా సమాచారమిచ్చారు. ఈ మేరకు గురువారం అన్ని పనులు మానుకొని పంచాయతీ కార్యాలయం వద్దకు నిర్వాసిత రైతులు వచ్చారు. గంటల తరబడి పంచాయతీ కార్యాలయం వద్ద అధికారుల కోసం వేచి చూశారు. అయినప్పటికీ వారు రాకపోవడంతో రైతులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. గతంలో భూత్పూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భూములను కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, మళ్లీ నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల నిర్మాణం కోసం కాట్రేపల్లి శివారులో మిగిలిన 90ఎకరాల భూమిని సైతం తీసుకోవడం వల్ల ఎలా బతకాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాకు తెలియకుండా భూసేకరణ చేపడితే సహించేది లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ ఇవ్వకుండానే భూములు లాక్కోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న తమ వద్ద ప్రభుత్వం బలవంతంగా భూములు లాక్కొని ప్రాజెక్టులు నిర్మిస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించి, భూముల కోల్పోయే ప్రతి కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం ఇస్తే తప్పా భూములు ఇచ్చేది లేదని, అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ప్రాజెక్టు నిర్మాణ పనులను అడ్డుకుంటామన్నారు. ఈ విషయమై మక్తల్ తాసీల్దార్ సతీశ్‌కుమార్‌ను వివరణ కోరగా.. కాట్రేవుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులతో అదనపు కలెక్టర్ సమావేశం ఏర్పాటు కావాల్సి ఉన్న మాట వాస్తవమేనని, అనివార్య కారణాల వల్ల రాలేకపోయారని తెలిపారు. కాగా, రైతుల స్థితిగతులను మరోసారి సర్వే చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు.

ధాన్యం కొనుగోలు చేసి లారీలను పంపించాలని ధర్నా చేపడుతున్న రైతులు

ధాన్యం కొనరు.. లారీలు రావు

- రెండు నెలలుగా కొనుగోలు కేంద్రాల్లో ఉంటున్నాం
- అధికారులు, సర్కారుపై రైతుల ఆగ్రహం
- గోపాల్‌పేటలో రోడ్డుపై ధర్నా
- మద్దతు తెలిపిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

గోపాల్‌పేట, మే 22 : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే కొనడం లేదు.. అరకొర కొన్నా లారీలు రావడం లేదని గురువారం గోపాల్‌పేట మండల కేంద్రంలో రైతులు రోడ్డెక్కారు. కాగా, ఈ ధర్నాకు బీఆర్ఎస్ నేతలు మద్దతు తెలుపగా, కాంగ్రెస్ నాయకులు సైతం జెండాలు పట్టుకొని రైతులకు మద్దతు తెలపడం చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చినప్పటికీ కొనుగోలుకు నోచుకోకపోవంతో అకాల వర్షాల వల్ల తడిసి ముద్దవుతున్నాయని వాపోయారు. నెల రోజులైనా ధాన్యం కొనుగోలు చేయకపోతే ఎలాగని ప్రశ్నించారు. కొనుగోలులో అధికారులు, సర్కారు విఫలం చెందిందని మండిపడ్డారు. వర్షాల నేపథ్యంలో ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలని వేడుకున్నా కనికరం లేకుండా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అకాల వర్షాలతో ధాన్యం తడిసి చాలా నష్టపోయామని, రైతులను ఇంతలా క్షోభ పెట్టడం సర్కారు తగదని ఆక్రోశం వెల్లగక్కారు. అనంతరం ధర్నా వద్దకు ఎస్సై నరేశ్‌కుమార్, డిప్యూటీ తాసీల్దార్ తిలక్‌కుమార్, ఆర్ఐ యాదయ్య చేరుకొని వేగంగా ధాన్యం కొనుగోళ్లు చేపడుతామని, లారీలు వచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

అన్నదాతల ఆగ్రహం

- కొనుగోలులో ఆలస్యాన్ని నిరసిస్తూ ధాన్యానికి నిప్పు

వీపనగండ్ల, మే 22 : అకాల వర్షాలకు వడ్లు తడిసి నష్టపోతున్నా ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ మండలంలోని కల్వరాలలో రైతులు రాస్తారోకో చేపట్టారు. ధాన్యంపై పెట్రోల్ పోసి దగ్ధం చేశారు. కల్లాల్ల ధాన్యం ఉంచి రెండు నెలలైనా కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిల్వచేసిన బస్తాలు తడిసి ముద్దగా మారి మొలకెత్తినప్పటికీ ఎవరూ స్పందించడం లేదని ఆరోపించారు. ఇంకా 70శాతం ధాన్యం కొనుగోలు చేయకపోతే ఎలాగని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు ఫోన్ ద్వారా వివరించారు. ఇందుకు అదనపు కలెక్టర్ స్పందించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాంలకు తరలించడంతోపాటు మిగిలిన ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. అనంతరం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు గోదాంను అదనపు పరిశీలించి కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను తరలించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని తాసీల్దార్ వరలక్ష్మిని ఆదేశించారు. రైతుల ఆందోళనతో వాహనాల రాకపోకలు ఇబ్బందులు తలెత్తాయి.

మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

వీపనగండ్ల మండలం కల్వరాలలో రోడ్డుకు అడ్డంగా రాళ్లు పెట్టి రాస్తారోకో చేస్తున్న రైతులు

బీఆర్ఎస్ హయాంలోనే చెంచుల అభివృద్ధి

- కాంగ్రెస్ పాలనలో ఒరిగిందేమీ లేదు
- ఆదివాసి చెంచుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు

మాట్లాడుతున్న చెంచు ఐక్య వేదిక సంఘం నేతలు

అమ్రాబాద్, మే 22 : చెంచులను కొంత మంది కాంగ్రెస్ నాయకులు, చెంచు నాయకులు తప్పుదోవ పట్టిస్తున్నారని, చెంచుల అభ్యున్నతికి కేసీఆర్ సర్కారు ఎంతో ప్రోత్సాహం అందించిందని ఆదివాసి చెంచుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని మన్ననూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19వ తేదీన మాచారంలో జరిగిన సీఎం సభలో 27మంది చెంచు కుటుంబాలకు పోడు భూముల పట్టాలు అందించినట్లు గొప్పలు చెబుతూ బీఆర్ఎస్ సర్కారు చెంచులను ఏ విధంగా ఆదుకోలేదని విమర్శించడం సరికాదన్నారు. మాచారానికి చెందిన అలివేలమ్మకు పోడు భూమి ఎకరం న్నర రాలేదని, లిస్టులో తమ పేరు లేదని తెలుసుకొని కుటుంబంతో సహా మరణించడానికి ప్రయత్నిస్తే కొంత మంది చెంచు పెద్దలు ఇట్టి విషయాన్ని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. దీంతో గువ్వల కలెక్టర్ సంతోష్, ఐటీడీఏ పీవో రోహిత్‌గోపిడితో మాట్లాడి అలివేలమ్మకు భూమి ఇచ్చేలా ఏర్పాటు చేశాడరని వెల్లడించారు. అయినా కొంతమంది కాంగ్రెస్ చెంచు నాయకులు ఈ విషయాన్ని మభ్యపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ భూములు ఇచ్చిందని తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో గువ్వల నేతృత్వంలో 483 మంది చెంచు కుటుంబాలకు పోడు భూముల పట్టాలు అందించారని, మన్ననూర్‌లో గిరిజన భవనం, 300 మంది చెంచు పోడు భూముల్లో బోర్లు వేయించడం, మహిళా సంఘాలకు సీసీడీపీ కింద ఆర్థికంగా ఎదగడానికి చేయూత అందించారని, న్యూట్రిషన్ కార్యక్రమం, చెంచు పెంటలను గ్రామపంచాయతీలుగా మార్చడం వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేశారని గుర్తుచేశారు. ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ 18 నెలల్లో చెంచులకు చేసిందేమీ లేదని, మన హక్కుల కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలోఓ ఐక్య సంఘం సంఘం నాయకులు పాల్గొన్నారు.

హన్వాడలో ధాన్యం వద్ద రైతులతో కలిసి నిరసన చేపట్టిన బీఆర్ఎస్ నాయకులు

టోకెన్ ఇచ్చారు.. కొనుగోలు మరిచారు..

హన్వాడ, మే 22 : టోకెన్ ఇచ్చి మూడు రోజులు కావొస్తున్నా ఇప్పటి వరకు కొనుగోలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదని ఈ సందర్భంగా రైతుబంధు సమితి మాజీ మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, వ్యవసాయ శాఖ మాజీ డైరెక్టర్ జంబులయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని వారు పరిశీలించి తూకాల్లో ఆలస్యాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ నెల 20వ తేదీన వ్యవసాయ శాఖ అధికారి టోకెన్ ఇచ్చినా నేటి వరకు వడ్లు తూకం చేయకపోవడంతో వర్షానికి ధాన్యం తడిసిపోయిందన్నారు. ఈ నష్టాన్ని ఎవరు భరిస్తారని ప్రశ్నించారు. ఓ వర్గానికి చెందిన వారి ధాన్యాన్ని తూకం చేయకపోవడం సిగ్గుచేటన్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే తూకం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సొసైటీ సిబ్బంది ధాన్యాన్ని తూకం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, నాయకులు జంబులయ్య, శ్రీనివాసులు, యాదయ్య, మాధవులు, చెన్నయ్య, రాములు, మల్కయ్య, శ్రీను, బాలకిష్టయ్య, మోహన్, సంతోష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జూరాల, తుంగభద్ర ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో

అయిజ/అమరచింత, మే 22 : కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు కృష్ణా, తుంగభద్ర నదులకు వరద చేరుతున్నది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 8,953 క్యూసెక్కులు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 4.175 టీఎంసీలుగా ఉన్నది. కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంలోకి డ్యాంలోకి ఇన్‌ఫ్లో 8,900 క్యూసెక్కులు ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. ఆర్డీఎస్ ఆనకట్టకు ఎగువ నుంచి వరద చేరుతోంది. ఆనకట్టకు 18వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, వచ్చిన నీరు వచ్చినట్లే దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి చేరుతోంది. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టపై ఒక అడుగు మేరకు నీటి ప్రవాహం ఉన్నట్లు కర్ణాటక డీఈ శాంతరాజు తెలిపారు.

సుంకేసుల నుంచి నీటి విడుదల..

రాజోళి, మే 22 : రాజోళి మండల శివారులోని సుంకేసుల డ్యాం నుంచి నీటిని దిగువకు తరలిస్తున్నట్లు డ్యాం ఏఈ మహేందర్‌రెడ్డి తెలిపారు. సుంకేసుల డ్యాంకు 17,648 క్యూసెక్కుల నీరు వస్తుండడంతో 4గేట్లు ఎత్తి శ్రీశైలానికి వదులుతున్నారు.

ఎస్‌బీఐలో అధికారుల చేతివాటం!

- రైతుల పేరుపై క్రాప్‌లోన్లు స్వాహా

న్యాయం చేయాలంటున్న బాధిత రైతు

ఊట్కూర్, మే 22 : బినామీ రైతుల డాక్యుమెంట్లు సృష్టించి క్రాప్ లోన్ నిధులు స్వాహా చేసిన ఊట్కూర్ ఎస్‌బీఐ అధికారులు, సిబ్బంది బాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నారాయణపేట జిల్లా కృష్ణ మండలం తంగిడికి చెందిన రైతు కురువ ఆశప్పకు సర్వే నెంబర్ 90/అ/ఆ2లో ఆరు ఎకరాల పొలం ఉంది. 2024 ఏప్రిల్‌లో రెండెకరాలు తన కుమారుడు సాయిబన్న పేరుపై పట్టా చేశాడు. తండ్రీ, కొడుకులు వ్యవసాయ రుణం పొందేందుకు కృష్ణ మండల కేంద్రంలోని కార్పొరేషన్ బ్యాంక్‌కు వెళ్లారు. బ్యాంక్ అధికారుల సూచన మేరకు సంబంధిత బ్యాంకుల నుంచి నో డ్యూవ్ సర్టిఫికెట్ పొందేందుకు వెళ్లారు. ఇదే క్రమంలో మక్తల్ ఎస్‌బీఐ నుంచి నో డ్యూవ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా, ఊట్కూర్ ఎస్‌బీఐలో కురువ ఆశప్ప పేరుపై రూ.లక్షా 70వేలు, సాయిబన్న పేరుపై రూ.లక్షా 60లక్షల వ్యవసాయ రుణం తీసుకున్నట్లు బ్యాంక్ అధికారులు చూపించారు. దీంతో గురువారం ఊట్కూర్ ఎస్‌బీఐకి చేరుకున్న బాధిత రైతులు తమకు తెలియకుండా క్రాప్ లోన్ ఎలా తీసుకుంటారని సిబ్బందిని నిలదీశారు. రైతులకు మద్దతుగా మాదాసి కురువ సంఘం జిల్లా కార్యదర్శి కురువ ఆశప్ప, సంఘం సభ్యులు బ్యాంక్ వద్దకు చేరుకొని అధికారులను ప్రశ్నించారు. బాధిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసన్న కుమారిని వివరణ కోరగా, బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్‌మోజెస్ బ్యాంక్ పనిపై టూర్ వెళ్లారని, ఆయన వస్తే డాక్యుమెంట్లను పరిశీలిస్తామని తెలిపారు.

500లకు పైగా బినామీ ఖాతాలు..

మక్తల్ నియోజకవర్గంలోని ఊట్కూర్, మక్తల్, మాగనూర్, కృష్ణ మండలాల నుంచి దాదాపు 500 మందికి పైగా రైతుల పేర్లపై బినామీ ఖాతాలు సృష్టించి క్రాప్ లోన్ నిధులను బ్యాంక్ అధికారులు కాజేసినట్లు ఎస్‌బీఐ ఉన్నతాధికారుల విచారణలో తేలింది. 2017-2018 సంవత్సరం ఊట్కూర్ ఎస్‌బీఐలో పనిచేసిన బ్యాంక్ అధికారులు మధ్య దళారులను అడ్డం పెట్టుకొని ఆయా మండలాలకు చెందిన రైతుల పేర్లపై సుమారు రూ. 5కోట్ల క్రాప్ లోన్ నిధులను గుట్టుచప్పుడు కాకుండా దారి మళ్లించినట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ఈ విషయమై బ్యాంక్ అధికారులు, కొందరు మధ్య దళారులపై పోలీసు కేసులు కూడా నమోదు చేశారు. కాగా, అప్పట్లో విచారణకు రాని అనేక మంది రైతులు క్రాప్ లోన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవడంతో బాధిత రైతుల పేర్లు కొత్తగా వెలుగులోకి వస్తున్నాయి.

గతుకుల రోడ్డుపై నిరసన

- టంకర రోడ్డును పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు
- రూ.7 కోట్లు ఇచ్చినా పనులు చేపట్టలేదని ఆగ్రహం

నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

హన్వాడ, మే 22 : గుంతలమయంగా మారిన హన్వాడ, టంకర, గుడ్డిమల్కాపూర్ రోడ్డుపై బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. గురువారం రోడ్డును పరిశీలించారు. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని త్వరగా పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మాజీ వైస్ ఎంపీపీ కొండా లక్ష్మయ్య మాట్లాడుతూ మూడు గ్రామాలను కలిపే రోడ్డు కోసం కేసీఆర్ సర్కారులో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రూ.7 కోట్ల నిధులు మంజూరు చేయగా పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రోడ్డుకిరువైపులా మట్టిని తీసి 17 నెలలు కావస్తున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం పనులపై దృష్టి సారించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రోడ్డుపై నీళ్లు చేరి బురదమయంగా మారిందన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలరాజు, మాజీ ఎంపీటీసీ మల్కయ్య, నాయకులు జంబులయ్య, శ్రీనివాసులు, మాధవులు, బసిరెడ్డి, యాదయ్య, మోహన్, బాలకిష్టయ్య, శ్రీను, రాములు, శేఖర్, సంతోష్, మాసయ్య తదితరులు పాల్గొన్నారు.